





నాగార్జున సాగర్ 26 గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతూ జాలువారుతున్న నీరు

కనువిందు.. కలవరం



రేపల్లె: పెనుమూడి కృష్ణానదికి చేరిన వరదనీరు



కొల్లూరు: గండి వద్ద పోసిన ఇసుక, కట్ట నుంచి లీకు అవుతున్న వరద నీరు



కొల్లూరు: గాజుల్లంక వద్ద ఇటుక బట్టీలను ముంచెత్తిన వరద నీరు



నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి



సెల్ఫీలతో సందడి చేస్తున్న పర్యాటకులు

- కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు
- సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- ప్రాజెక్టుల వద్దకు పోటెత్తుతోన్న పర్యాటకులు
- అంతకంతకూ పెరుగుతోన్న ప్రవాహ ఉధృతి
- పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతున్న వరద నీరు
- సుమారు 3 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు
- వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకుంటున్న మత్స్యకారులు

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. సాగర్ నుంచి సాగరం దిశగా పరుగులు పెడుతోంది. వరద ప్రవాహ ఉధృతి అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని గేట్లు తెరిచి దిగువకు నీటిని వదిలేస్తుండగా ఆ ప్రవాహ సోయగాలను చూసేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. నాగార్జున సాగర్ 26 గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను పర్యాటకులు కనులారా తిలకించి సంబ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. ప్రకాశం బ్యారేజ వద్ద కృష్ణమ్మ ప్రవాహాన్ని తిలకించేందుకు కూడా జనం పోటీ పడ్డారు. కృష్ణమ్మ వరద ఉధృతి గురువారం కూడా కొనసాగడంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముంపు ప్రాంతాలను కృష్ణమ్మ ముంచేస్తోంది. బ్యారేజీ దిగువన లంక గ్రామాల ప్రజలు కృష్ణమ్మ ఉధృతి ఎప్పటికి తగ్గుతుందోనని ఎదురుచూస్తున్నారు.

ముంపు.. ముప్పు

రేపల్లె, కొల్లూరు, ఆగస్టు 8: కృష్ణానదికి వరద పోటెత్తటంతో కరకట్ట వెంబడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. అంతకంతకు ప్రవాహ ఉధృతి పెరుగుతూ వస్తుండటంతో లంకలు, తీర ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో కృష్ణానదీ పరివాహక ప్రాంత ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేస్తూవస్తోంది. గురువారం రేపల్లె మండలం పెనుమూడికి వరదనీరు పోటెత్తింది. మూడు మెట్లు నీటమునిగాయి. మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చుకుని వలలను భద్రం చేసుకుంటున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద 50 గేట్లు ఎత్తి సుమారు 3 లక్షల క్యూసెక్కులు దిగువకు వదలడంతో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో చేపల వేటకు మత్స్యకారులు వెళ్ళరాదని అధికారులు సూచించారు. రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి, మైనేనివారిపాలెం, మోర్తోట, గంగడిపాలెం, రాజుకాల్వ, లంకేవానిదిబ్బ, లక్ష్మీపురం గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ కూడా నది తీరానికి వెళ్లరాదని హెచ్చరికలు జారీచేశారు. కరకట్ట వెంబడి ఉన్న గృహాలవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, ఇబ్బందులు ఉంటే తక్షణమే రెవెన్యూ సిబ్బందికి తెలపాలని సూచించారు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కరకట్ట పటిష్ఠతపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొల్లూరు మండలంలోని అరవిందవారధి, గాజుల్లంక, పోతార్లంక, జువ్వలపాలెం పుష్కర ఘాట్‌లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. గాజుల్లంక వద్ద చిన్నరేవు నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో పల్లపు ప్రాంతాల్లో వాణిజ్య పంటలు, ఇటుక బట్టీలు ముంపునకు గురయ్యాయి. కల్లాల్లో ఉన్న ఇటుక తయారీ ముడిసరుకు ఊక, ప్లైయాష్ వరద నీటిలో కొట్టుకుపోయాయి. చిన్నరేవులో వరదనీరు మెల్లమెల్లగా ప్రాంతాలను ముంచెత్తుతూ పరుగులు తీస్తుంది. ఈ ప్రవాహం దోనేపూడి కరకట్ట దిగువన ఉన్న పోతార్లంక లోలెవల్ చప్టాపై నుంచి వెళ్లే అవకాశాలు ఉండటంతో కొన్ని గంటల్లో ఆ రహదారిపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. గాజుల్లంక, పోతార్లంక మధ్య నది అంచులు బలహీనంగా ఉండటంతో వరదనీరు సీపేజ్ అయి పొలాలను ముంచెత్తుతోంది. వరద ఉధృతి 4లక్షలకు పైగా పెరిగితే రహదారులపై కూడా నీరు ప్రవహించే సూచనలు కనిపిస్తున్నాయి. వరద ఉధృతి కొనసాగుతుండటంతో రేపల్లె ఆర్డీవో హేలాషారోన్ లంక గ్రామాల్లో గురువారం పర్యటించారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, పోతార్లంక, గాజుల్లంక, పెసర్లంక తదితర లంక గ్రామాల్లో ముంపు ప్రాంతాలను పరిశీలించి ప్రజల రాకపోకల కోసం పడవలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోతార్లంక వద్ద మత్స్యకారులతో మాట్లాడారు. రావిలంకలో చిక్కుకుపోయిన రెవెన్యూ, పంచాయితీ సిబ్బందిని మరబోటు సహాయంతో తీసుకువచ్చారు. అరవింద వారధి ఎగువన గండికి అడ్డుగా పోసిన కట్ట మూడున్నర లక్షల వరద నీరు వరకు తట్టుకుంటుందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆర్డీవోకు తెలిపారు. నదిలోకి ఎవరూ దిగకుండా చూడాలని, రేవుల వద్ద ఉన్న పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆర్డీవో వెంట కొల్లూరు ఎంపీడీవో లక్ష్మీకుమారి, డీటీ నిరంజన్, ఆర్ఐ త్రివేణి, ఈవోపీఆర్డీ రవి తదితరులు ఉన్నారు.

వీపీసౌత్, మాచర్ల రూరల్, అచ్చంపేట, తాడేపల్లి టౌన్/ నరసరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) కృష్ణమ్మ కనువిందు చేస్తోంది. నాగార్జున సాగర్ జలాశయం 26 క్రస్ట్ గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను పర్యాటకులు కనులారా తిలకిస్తున్నారు. పాల నురగలా స్పిల్ వే గుండా కృష్ణమ్మ పరవళ్ల తొక్కుతోంది. సాగర్ జలాశయానికి భారీగా వరద కొనసాగుతోంది. దీంతో గురువారం అన్ని గేట్లు తెరుచుకున్నాయి. డ్యాంకు వస్తున్న నీటిని వస్తున్నట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. 26 క్రస్ట్ గేట్ల తెరచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 22 క్రస్టగేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,67,906 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కుడి కాల్వ ద్వారా 8144, ఎడమ కాల్వ ద్వారా 8193, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,501, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 మొత్తం ఔట్‌ఫ్లోగా 3,14,544 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,94,683 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.40 అడుగలకు చేరింది. నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 295.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 2,54,698 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుండగా ఆరు గేట్ల ద్వారా 2,42,601 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 12వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది.

ప్రకాశం బ్యారేజి వద్దకు భారీగా వరద

ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చి చేరుతోంది. పులిచింతల నుంచి 2 లక్ష 56 వేలు, కీసర వాగు నుంచి 54 వేల క్యూసెక్కులు మొత్తం 3 లక్షల 10 వేల క్యూసెక్కుల వరద నీరు గురువారం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 7 అడుగులు, 10 గేట్లను 8 అడుగులు ఎత్తి దిగువకు 2 లక్ష 96 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 13వేల 800 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు. కాగా గురువారం అర్ధరాత్రికి వరద ఉధృతి స్వల్పంగా తగ్గే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి రైతులు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



పులిచింతల ప్రాజెక్టు నుంచి పరవళ్లు తొక్కుతున్న వరదనీరు



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

విద్యుత్‌శాఖ హెల్ప్‌లైన్ సెంటర్‌లు

గుంటూరు: విస్తృతంగా వర్షాలు, వరదల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదు డివిజన్లలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ తెలిపారు. విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా, తెగిపడిన విద్యుత్ తీగెలు వంటి సమస్యలపై గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 9440817526, గుంటూరు టౌన్-1 డివిజన్ కార్యాలయం 9440817527, తెనాలి డివిజన్ 9440817535, బాపట్ల డివిజన్ 9491052945, నరసరావుపేట డివిజన్ 9440817539, మాచర్ల 9440817531 లకు ఫోన్లు చేసి సమాచారం అందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు తడిచిన ఇనుప స్తంభాలను తాకకుండా దూరంగా ఉండాలన్నారు. తెగిపడిన విద్యుత్ తీగెలకు దూరంగా ఉండాలని సూచించారు.

- గేటెడ్ కమ్యూనిటీల స్థాయిలో అభివృద్ధి
- చిలకలూరిపేటలో ఇళ్ల పరిశీలనలో మంత్రి నారాయణ

సకల వసతులతో టిడ్కో ఇళ్లు



టిడ్కో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 8: సకల వసతులతో టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. గురువారం చిలకలూరిపేటలో టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించి నివశిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. చిలకలూరిపేట నుంచి టిడ్కో గృహ సముదాయం కమ్మవారిపాలెం మీదగా నరసరావుపేట వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గేటెడ్ కమ్యూనిటీల స్థాయిలో టిడ్కో ఇళ్ల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లకు పేర్లు పెట్టిన వైసీపీ నేతలు గడిచిన ఐదేళ్లలో పేదలకు ఇళ్ల నిర్మాణం విషయంలో ఏం చేశారో దేశం మొత్తం చూసిందని ఎద్దేవా చేశారు. పైగా ఆ కట్టిన టిడ్కో ఇళ్లను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. చిలకలూరిపేట టిడ్కో గృహ సముదాయానికి పాఠశాల, ఆస్పత్రి, కమ్యూనిటీ హాల్ కావాలని ప్రత్తిపాటి కోరారని, ఈ మూడింటిని మంజూరు చేశామని, మార్చి నెలాఖరు లోగా వీటిని పూర్తి చేస్తామని నారాయణ తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కొన్ని చోట్ల నాలుగు గోడలు కట్టి స్లాబులు వేశారని, మనిషి పడుకోవడానికి కూడా సరి పోవని వైసీపీ ఎమ్మెల్యేనే కామెంట్ చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గుర్తుచేశారు. ఇప్పుడు తిరిగి టీడీపీ ప్రభుత్వం రావడంతో పేదలు ఆత్మగౌరవంతో ఉండేలా సకల వసతులతో టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి అందించే అవకాశం లభించిందన్నారు. అంతకముందు మంత్రి ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి పనుల పురోగతి, వసతులపై అధికారులతో మాట్లాడారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి వంద అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చిలకలూరిపేటలోని మూడు అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. మంత్రి పర్యటనలో గృహనిర్మాణ శాఖ ఎండీ వర్మ, మున్సిపల్ కమిషనర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

- విత్తనాలు, ఎరువుల నాణ్యతపై నిర్లక్ష్యం
- ఎరువుల్లో 97 శ్యాంపిల్స్‌కి తీసింది 15 మాత్రమే
- వ్యవసాయశాఖ లక్ష్యంలో 40 శాతం కూడా లేదు

నమూనాల సేకరణ.. నామమాత్రమే

గుంటూరు సిటీ, ఆగస్టు 8: రైతులకు మేలు జరగాలంటే తొలుత చేయాల్సింది విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో నకిలీలను అరికట్టాలి. నాణ్యమైన విత్తనాలు సకాలంలో రైతుకు అందితే దిగుబడి ఆశాజనకంగా ఉండి రైతులకు లబ్ధి జరుగుతుంది. ఇందుకు వ్యవసాయశాఖ చేయాల్సింది.. ఆయా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నమూనాల ను ఎక్కడికక్కడ సేకరించి నాణ్యతను నిర్ధారించి రైతుల ను అప్రమత్తం చేయాలి. కానీ ఖరీఫ్ సీజన్ సగం దాటుతున్నా వ్యవసాయశాఖ నిద్ర మేలుకోలేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో నకిలీలను నిగ్గుతేల్చే నమూనాల సేకరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఏడాది లక్ష్యంలో కనీసం 40శాతం అన్నా ఈ పాటికి పూర్తికావాల్సి ఉండగా నమూనాల సేకరణ సంఖ్య నామమాత్రంగానే కనిపిస్తుంది. ఎరువుల్లో ఏడాదికి 213 నమూనాలు సేకరించాలి. మే, జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో 97 నమూనాలు సేకరించాల్సి ఉండగా, ఇప్పటికి కేవలం 15 మాత్రమే తీశారు. పురుగుమందులు సుమారు 195 నమూనాలు సేకరించాల్సి ఉండగా, ఇప్పటికి కేవలం 30 మాత్రమే సేకరించారు. బహిరంగ మార్కెట్‌లో రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు నాణ్యమైనవో, నకిలీవో తేలాలంటే నమూనాల సేకరణ జరగాలి. అది కూడా వ్యాపారస్థలంలోనే జరగాలి. గతంలో సుమారు 400 నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా వాటిల్లో 40 శ్యాంపిల్స్ విఫలమయ్యాయి. వారిలో కొంతమందిపై కేసులు నమోదు చేసి కోర్టు కు పంపారు.

ఎన్ని నమూనాలు తీస్తే అంత మంచిది


రైతులకు మేలు జరగాలంటే విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల నమూనాలు ఎక్కువ సేకరించి ల్యాబ్‌కు పంపాలని నిపుణులు చెబుతున్నారు. దానివల్ల నకిలీలను అరికట్టే అవకాశం ఎక్కువ ఉంటుందంటున్నారు. అసలు నమూనాలు తీయకపోవడం నకిలీలు అమ్మే వారికి తోడ్పడట మే అని చెబుతున్నారు. ఎరువుల్లోని మైక్రో న్యూట్రేట్స్, మ్యాక్రో న్యూట్రేట్స్‌లో నమూనాలు సేకరించాలి. మిక్సర్ ఫర్టిలైజర్స్‌గా పేర్కొనే ఎరువుల్లో ఎక్కువ నకిలీలు వచ్చే అవకాశం ఉన్నందున వాటిల్లో సుమారు 90 నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలి. గతంలో మైక్రో న్యూట్రేట్స్, మ్యాక్రో న్యూట్రేట్స్ నమూనాల్లో కొన్ని విఫలమైనట్లు తెలుస్తోంది. ఇప్పుడు అసలు ఆ నమూనాల జోలికి అధికారులు వెళ్లలేదని తెలుస్తోంది.

విత్తనాల్లో ఫెయిల్యూర్ ఎక్కువ

గత ఏడాది విత్తనాలకు సంబంధించి 241 శ్యాంపిల్స్ తీస్తే అందులో నాలుగు విఫలమయ్యాయి. గుంటూరు ఆటోనగర్‌లోని ఓ విత్తన కంపెనీకి చెందిన మిర్చి, మరో రెండు కంపెనీల పత్తి విత్తనాలు విఫలమయ్యాయి. పురుగుమందుల నమూనాలు కూడా గత ఏడాది 175కు 135 తీశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల శ్యాంపిల్స్ తీసే విషయంలో అర్బన్ పరిధిలోని అధికారుల్లో నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపిస్తుంది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యవసాయ శాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించి అధికారులకు పలు సూచనలు చేశారు. మొదట్లో కొంత హడావుడి చేశారు. ఆ తర్వాత కాడి పూర్తిగా కిందేశారు. ఇప్పటికైనా అధికారులు నమూనాలు సేకరిస్తే రానున్న రోజుల్లో అయినా రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటోంది.







రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

- 30 మందికి పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ ఉత్తర్వులు

గుంటూరు, ఆగస్టు 8: గుంటూరు రేంజిలో మరోసారి భారీగా సీఐలను బదిలీ చేశారు. 30 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులకు గురై వీఆర్‌లో ఉండి కనీసం జీతాలు అందక ఇబ్బందులు పడిన సీఐలకు ఎట్టకేలకు పోస్టింగ్‌లు దక్కాయి. బదిలీ అయిన ఆయా సీఐల వివరాలు..

పేరు	ప్రస్తుతం	బదిలీ
టీపీ నారాయణస్వామి	కారంపూడి	పెదకాకాని
గంగా వెంకటేశ్వర్లు	వీఆర్	తుళ్లూరు -1
బెల్లం శ్రీనివాసరావు	వీఆర్	తెనాలి రూరల్
దాసరి ప్రసాద్	గిద్దలూరు	గురజాల టౌన్
పీ ప్రభాకర్	వీఆర్	మాచర్ల టౌన్
షేక్ నఫీజ్‌బాష	కందుకూరు	మాచర్ల రూరల్
టీవీ శ్రీనివాసరావు	కోవూరు	కారంపూడి
ఆర్ అహ్మద్‌జానీ	ఎస్‌బీ-2 నెల్లూరు	బాపట్ల టౌన్
కే గంగాధర్‌రావు	ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ తిరుపతి	బాపట్ల రూరల్
షేక్ అన్వర్‌బాష	కొత్తపేట గుంటూరు	నెల్లూరు 4వ పట్టణం
ఎం రోశయ్య	సౌత్ ట్రాఫిక్, నెల్లూరు	నెల్లూరు ఫోర్త్ టౌన్
జీ గంగాధర్‌రావు	వీఆర్	ఆత్మకూరు
కే వాసు	కమాండ్ కంట్రోల్, తిరుపతి	తాడికొండ
మాకినేని శ్రీనివాసరావు	డీటీసీ, ఒంగోలు	అమరావతి
వై రామారావు	వీఆర్	దర్శి
కే సురేష్	మాచర్ల రూరల్	గిద్దలూరు
జే రామకోటయ్య	కంభం	గిద్దలూరు
ఎండీ ఫిరోజ్	కలిగిరి	కావలి 1 టౌన్
కేశవ వెంకటేశ్వరరావు	కంట్రోల్ రూమ్, ఒంగోలు	కందుకూరు
జీ మంగారావు	పెదకూరపాడు	గుడ్లూరు
వై వీరసోమయ్య	గిద్దలూరు	పాత గుంటూరు
కే శేఖర్‌బాబు	వీఆర్	గూడూరు 1 టౌన్
హెచ్ఎస్ హుస్సేన్‌బాష	సైబర్ క్రైమ్, నెల్లూరు	వాకాడు
ఎం బాబి	నెల్లూరు 2 టౌన్	నాయుడుపేట
మాకినేని మురళీకృష్ణ	వీఆర్	సూళ్లూరుపేట
జీ సోమశేఖర్	చీరాల 2 టౌన్	కొండేపి
ఏవీ శివప్రసాద్	కంట్రోల్ రూమ్, గుంటూరు	లాలాపేట, గుంటూరు
కే వేమారెడ్డి	మహిళా పీఎస్, గుంటూరు	సంగం
ఎం వీరయ్య	వీఆర్	కొత్తపేట, గుంటూరు
ఎస్ శ్రీకాంత్‌బాబు	వీఆర్	ఒంగోలు రూరల్ సర్కిల్

నలుగురు డీఎస్పీలకు స్థానచలనం

రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. గుంటూరు పశ్చిమ డీఎస్పీ కేవీ మహేష్‌ను అనంతపురం జిల్లా హిందూపురానికి బదిలీ చేశారు. సీఐడీలో ఉన్న వీవీ రమణకుమార్‌ను నెల్లూరు జిల్లా గూడూరు సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్ లో ఉన్న గోగినేని రామాంజనేయులును బాపట్ల సబ్ డివిజన్‌కు నియమించారు. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను సీఐడీ విభాగానికి బదిలీ చేశారు.

ఆరోపణలు.. పోస్టింగ్‌లు

గత వైసీపీ ప్రభుత్వంలో గోగినేని రామాంజనేయులుకు సంబంధం లేని కేసులో సస్పెండ్ చేసి వేధించారు. ఐదేళ్ల ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా మానసిక ఇబ్బందులకు గురి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. అప్పటి నుంచి వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు తాజాగా పోస్టింగ్ దక్కింది. ఇక అనంతపురం జిల్లా హిందూపురం సబ్ డివిజన్‌కు బదిలీ అయిన కేవీ మహేష్, నెల్లూరు జిల్లా గూడూరు సబ్ డివిజన్‌కు నియమితులైన వీవీ రమణకుమార్‌లపై పలు ఆరోపణలు ఉన్నాయి. పైగా వారు గత ప్రభుత్వంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు ముద్రపడినా తాజాగా కూటమి ప్రభుత్వంలో పోస్టింగ్‌లు సంపాదించినట్లు పోలీస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఒకప్పుడు అడవులను రక్షించే పాత్రల్లో హీరోలు ఇప్పుడు అటవీ సంపద దోచుకోవడమే హీరోయిజం



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- అల్లు అర్జున్‌ను ఉద్దేశించేనా?

ఒకప్పుడు అడవులను రక్షించే కథాంశాలతో వచ్చిన సినిమాలలో హీరోలు నటించేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు ఉదాహరణగా కన్నడ సినిమా 'గంధ దగుడి' చిత్రాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఈనాడు అటవీ సంపదను దోచుకోవడమే హీరోయిజంగా సినిమాలు వస్తున్నాయని ఆయన విచారం వ్యక్తంచేశారు. రీల్‌కు, రియాలిటీకి తేడా ఉంటుందన్నారు. పుష్ప సినిమాలో అడవుల్లోని ఎర్రచందనం కొల్లగొట్టే పాత్రలో హీరో అల్లు అర్జున్ నటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే పవన్‌కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మానవత్వం చూపాల్సిన తరుణం ఇది

ఇటీవల కురిసిన భారీ వర్షాలు కేరళలోని వయనాడ్‌లో విషాదాన్ని మిగిల్చాయి. కొండ చరియలు విరిగి పడడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం కేరళ వెళ్లి నేరుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి విరాళం చెక్కును అందజేశారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మానవత్వం చూపాల్సిన తరుణం ఇది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతుగా కేరళకు సాయం అందించాలి. ఈ దుర్ఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి' అని కోరారు.





నాగచైతన్య శోభిత నిశ్చితార్థం

టాలీవుడ్ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. కొన్నాళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ కథానాయిక శోభితా దూళిపాళ్లతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం ఉదయం హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసి, కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరారు. 'ఈ రోజు ఉదయం మా అబ్బాయి నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఈ మధుర క్షణాలను మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. చాలా సంతోషంగా శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. మీ ఇద్దరూ ప్రేమ, సంతోషంతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున పేర్కొన్నారు. నిశ్చితార్థ వేడుకలో శోభిత ఉప్పాడ పట్టు చీర ధరించగా, నాగచైతన్య పంచెకట్టు, పైన కండువా ధరించి సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. పలువురు సినీ ప్రముఖులు నాగచైతన్య, శోభితకు అభినందనలు తెలిపారు. మరికొద్ది రోజుల్లో వీరి వివాహం జరగనుంది. సమంతతో విడాకులు తీసుకున్నాక నాగచైతన్య శోభితతో ప్రేమలో పడ్డారనీ, ఇద్దరూ తరచూ కలుసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. పలు సందర్భాల్లో నాగచైతన్య, శోభితా జంటగా కనిపించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. కానీ నిశ్చితార్థం వరకూ వారు ఎక్కడా దీనిపై స్పందించలేదు. నాగచైతన్య, శోభిత కలసి ఒక్క సినిమా కూడా చేయలేదు. స్నేహితుల ద్వారా ఇద్దరికీ పరిచయం అయ్యి అది ప్రేమగా మారిందని సమాచారం. చూసేందుకు ఇంటర్నేషనల్ మోడల్‌లా కనిపించే శోభిత తెలుగమ్మాయే. తెనాలిలో జన్మించారు. కొన్నాళ్లు కుటుంబంతో విశాఖలో ఉన్నారు. ముంబైలో ఉన్నత విద్యను అభ్యసించారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 2013 ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ గెలుచుకున్నారు. 2016లో వచ్చిన బాలీవుడ్ చిత్రం 'రామన్ రాఘవన్'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 'గూఢచారి, మేజర్' చిత్రాల్లో నటించారు.

నాడు ప్రేమ ప్రకటన

'ఏ మాయ చేశావే' చిత్రంలో జంటగా నటించిన నాగచైతన్య, సమంత ఏడేళ్ల డేటింగ్ తర్వాత 2017లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2021లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 8న నాగచైతన్యకు తన ప్రేమ ప్రతిపాదన చేశానని సమంత ఓ సందర్భంలో చెప్పారనీ, ఇప్పుడు అదే తేదీన నాగచైతన్య శోభితల నిశ్చితార్థం జరగడం కాకతాళీయమేనా, కావాలనే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. శోభిత హిందీలో 'సితార' చిత్రం చేస్తున్నారు.



ముందస్తు బెయిల్

నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ ఫిర్యాదుపై అతనిపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజ్‌తరుణ్ రెండు వారాల్లో నార్సింగ్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, రూ.20 వేల బాండు, రెండు పూచీకత్తులు ఇవ్వాలని జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం ఆదేశించింది. 8 వారాల పాటు ప్రతి శనివారం పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. మరోవైపు రాజ్‌తరుణ్ స్నేహితుడు శేఖర్ బాషాతో తనకు ప్రాణహాని ఉందని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెట్స్‌లోకి...



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి దశ షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా సెట్స్‌లోకి బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానిస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "పవన్, అనుపమ్ ఖేర్ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయి. అభిమానులకి జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది" అని మేకర్స్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

షెకావత్ సాబ్



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో హీరోతో పాటు కీలక పాత్రలు పోషిస్తున్న ఆర్టిస్టులు పాల్గొనగా పతాక సన్నివేశాలు తీస్తున్నారు. బన్వర్‌సింగ్ షెకావత్‌గా నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ లుక్ పోస్టర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా గురువారం విడుదల చేశారు. గళ్ల లుంగీ, ఒక చేతిలో గన్, మరో చేతిలో గొడ్డలితో ఫహాద్ కనిపిస్తున్నారు. డిసెంబర్ 6న 'పుష్ప 2' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మిస్తున్నారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక కొణిదెల నిర్మాతగా మారారు. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిహారిక మీడియాతో ముచ్చటించారు. "కథ విన్న వెంటనే ఈ సినిమాలో భాగం అవ్వాలనుకున్నాను. ఒక ఊరిలో జాతర నేపథ్యంలో మూడు తరాలకు చెందిన కథగా దర్శకుడు తెరకెక్కించారు. అందరికీ సినిమా విపరీతంగా నచ్చుతుంది. ఇందులో ఎన్నో క్యారెక్టర్లు ఉన్నా.. ప్రతీ పాత్రకూ విలువ ఉంటుంది. ప్రేక్షకులు ఏదో ఒక పాత్రతో కచ్చితంగా ట్రావెల్ అవుతారు. ఒక నిర్మాతగా ఈ సినిమా నాకెంతో సంతృప్తినిచ్చింది" అని చెప్పారు.



ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధర్ రావు

వాస్తవానికి ప్రతిభింభం మోదుకూరి రచనలు

● ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు

●జగ్జీవన్‌రామ్ చైర్ ఆధ్వర్యంలో మోదుకూరి జాన్సన్ జయంతి

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు8: మనిషి జీవితంలోని వాస్తవ పరిస్థితులకు ప్రతిబింభం మోదుకూరి జాన్సన్ రచనలు అని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం సినీ కవి, రచయిత మోదుకూరి జాన్సన్ 90వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు మోదుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని, తోటి వారిని ప్రేమించిన వారే నిజమైన సామాజిక వాదులవుతారని, ఆ లక్షణాలు పుణికిపుచ్చుకున్న మోదుకూరి సామాజిక కవి అయ్యారన్నారు. అన్ని అసమానతలను రూపుమాసేందుకు దోహదంచేసే మోదుకూరి కవిత్వం, ఆలోచనా విధానంపై మరింత విస్తృతమైన పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యక ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ.సింహాచలం మాట్లాడుతూ సమాజంలోని వాస్తవ పరిస్థితులను తన కలం ద్వారా చాటి చెప్పిన వాస్తవ కవి జాన్సన్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ మోదుకూని జాన్సన్ గతంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ సెనేట్ సభ్యునిగా పని చేశారని, ఆయన కవిత్వంపై యూనివర్సిటీ పరిధిలో రెండు డాక్టరేట్‌లు ప్రదానం చేసినట్లు గుర్తుచేశారు. హైదరాబాద్ ప్రభుత్వ సిటీకళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థులు, పరిశోధకులకు ఎంతో ప్రయోజకరమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ టీ.పృథ్వీరాజ్, అంబేడ్కర్, పూలే, గాంధీ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య వై.అశోక్ కుమార్, ఆచార్యా త్రిమూర్తిరావు, డాక్టర్ సోమశేఖర్, నాటక కళాకారుడు సుద్దపల్లి శరత్, ఉద్యోగసంఘ నేతలు కే.సుబ్బారావు, కనకరాజు, డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్ ప్రసంగించారు. పలువురు అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వీసీ గంగాధర్ రావును సత్కరిస్తున్న ఒంగోలు వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీతో

ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ భేటీ

పెదకాకాని, ఆగస్టు 8 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావును గురువారం ఒంగోలు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఏఎన్‌యూలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వీరితోపాటు ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ. హరిబాబు ఏఎన్యూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జీ.అనిత, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వీ.రవికుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి వర్సిటీలోని జర్నలిజం విభాగాన్ని సందర్శించి ఏఎన్ యూరేడియో, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో, పరిశోధకులతో ముచ్చటించారు.

నిందితుడి కిడ్నాప్.. సుఖాంతం

● వెంటనే స్పందించి రంగంలోకి దిగిన పోలీసులు

● గంటల వ్యవధిలో నిందితులు అదుపులోకి..

● ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు

వినుకొండటౌన్, ఆగస్టు 9: పాత కక్షల నేపథ్యంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉండి బెయిల్‌పై వచ్చిన వ్యక్తి కిడ్నాప్‌కి గురైన ఘటన వినుకొండ పట్టణంలో కలకలం సృష్టించింది. అయితే నిందితులను గంటల వ్యవధిలోనే పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.

వినుకొండ సీఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల నియోజకవర్గం, దుర్గి మండలం, జంగమేశ్వరపాడు గ్రామానిక చెందిన ఒంటేరు నాగరాజు మూడు నెలల క్రితం నుంచి తన తల్లి వెంకమ్మతో కలసి వినుకొండలో మిద్దెబావి వద్ద నివాసం ఉంటున్న బావమరిది రవి వద్ద నివాసం ఉంటున్నారు. నాగరాజు ఆటోలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం నాగరాజు కుటుంబ సభ్యులతో కలసి కూరగాయలు అమ్ముకునేందుకు బొల్లాపల్లి మండలం వైపు వెళ్తుండగా, వెంకపాలెం సమీపంలోని, నగరవనం వద్ద జంగమేశ్వరపాడు చెందిన ఎనిమిది మంది కారులోవచ్చి, వారి ఆటోను అడ్డుకున్నారు. ఆటోలో వున్న నాగరాజు బావమరిది రవిపై దాడి చేశారు. నాగరాజు తల్లి వెంకమ్మ, సోదరిని పక్కకు లాగివేశారు. అనంతరం నాగరాజును బయటకు లాగి, కారులో ఎక్కించుకొని వెల్లటూరు వైపు తీసుకుపోయారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందగానే హుటాహుటిన ఘటనా ప్రాంతానికి వెళ్లి గాయపడిన నాగరాజు తల్లి వెంకమ్మ, యర్రబోయిన రవి, అతని భార్య భువనేశ్వరిలను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. నాగరాజును కిడ్నాప్ చేసిన వారిలో వారి బంధువులైన టంగుటూరి. కొండలు, టంగుటూరి. మల్లికార్జున, ఆవుల. జాలయ్య, ఆరెద్దుల మణి, తండ్రి ఆరెద్దుల శ్రీను. కంచర్ల బొర్రయ్య కుమారుడు పాశం కొండలు, పాశం అంజి ఉన్నారని నాగరాజు తల్లి తెలిపారు.

రెండు కేసుల్లో ముద్దాయి..

కిడ్నాప్‌కు గురైన నాగరాజు వైసీపీ కార్యకర్త కాగా, అతనికి వైసీపీ ప్రభుత్వ హయాంలో దుర్గి, మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ప్రధాన హత్యకేసుల్లో ముద్దాయిలతో మంచి సంబంధాలున్నాయి. ఎన్నికల సమయంలో కొలగట్ల వద్ద కాపుకాచి టీడీపీ, జనసేన నాయకుల కార్లు ధ్వంసంచేసిన కేసులో నెల్లూరు జైలుకి వెళ్లి


కిడ్నాప్‌కి గురైన నాగరాజుతో వినుకొండ పోలీసులు

ఇటీవలే బెయిల్‌పై వచ్చాడు. అలాగే కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడి కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. గతంలో జరిగిన జాలయ్య హత్యకేసు ముద్దాయిలతో మంచి సంబంధాలు ఉన్నాయి.

గంటల వ్యవధిలో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

కిడ్నాప్ ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేయటంతో పోలీసులు రంగంలోకి దిగి కేసును కొద్ది గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బొల్లాపల్లి మండలం మర్రిపాలెం వద్ద కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నామని, కిడ్నాప్‌కు గురైన నాగరాజు సురక్షితంగా ఉన్నాడని ఉన్నాడని పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో నాగరాజు కుటుంబ సభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

జంగమహేశ్వరపాడులో పోలీసుల బందోబస్తు

దుర్గి: నాగరాజు కిడ్నాప్ ఘటన నేపథ్యంలో మండలంలోని జంగమహేశ్వరపాడు గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అలహరి శ్రీనివాసరావు, మాచర్ల రూరల్ ఎస్ఐ కుర్రి రాజశేఖర్‌లు తమ సిబ్బందిని అప్రమత్తం చేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నాగరాజుతో పాటు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. నాగరాజు వైసీపీ రౌడీ షీటర్ ఊరిబండి మన్నెయ్య ప్రధాన అనుచరుడు. ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన మొక్కుబడులు తీర్చుకొని వస్తున్న టీడీపీ నేతలను దుర్గి సమీపంలో ముటుకూరు రోడ్డు వద్ద కాపుకాచి దాడిచేసిన, ఈ ఏడాది మార్చి 22న దుర్గి నుంచి మించాలపాడు వెళ్తున్న జనసేన వాహనాన్ని అడ్డుకొని ధ్వంసం చేసి జనసేన నేతలను గాయపరిచిన కేసుల్లో నాగరాజు నిందితుడు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పీ.అరుణ్‌బాబు

● పల్నాడు జిల్లా కలెక్టర్ పీ.అరుణ్ బాబు

● నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష

నరసరావుపేటరూరల్, ఆగస్టు 8:స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాల పల్నాడుజిల్లా కలెక్టర్ పీ.అరుణ్‌బాబు జిల్లా అధికారులకు సూచించారు. పట్టణంలోని కోడెల శివప్రసాద్ క్రీడాప్రాంగణంలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమానికి సంబంధించి నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టర్ పీ.అరుణ్‌బాబు గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హాల్లో జేసీ సూరజ్, అదనపు ఎస్పీ, అధికారులతో కలిసిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. వేదిక అలంకరణ, కుర్చీల ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా సరిచూసుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పైలెట్ వాహనం, శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాల ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలని తెలిపారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాల వారు గార్డ్ ఆఫ్ హానర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టిసారించాలని, సమన్వయం చేసుకోవాలని సూచించారు. వేడుకలకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

4 లైన్లరోడ్డు కోసం రూ.40 కోట్లు

సత్తెనపల్లి, ఆగస్టు 8 : సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి నుంచి నందిగామ వరకు ఎన్ఎస్‌పీ కెనాల్ పై నాలుగు లైన్‌ల రోడ్డు కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రూ.40 కోట్లు ఖర్చు చేసే ప్రతిపాదనకు అంగీకరించారని కన్నా కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలతో కలసి కన్నా కేంద్ర మంత్రిని నితిన్ గడ్కరీని కలసిన విషయం పాఠకులకు విదితమే. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని మెచ్చుకున్న గడ్కరీ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు నివ్వటం హర్షణీయమని ప్రజల్లో చర్చసాగుతోంది.

ఖరీఫ్ పంటల ప్రణాళికపై వర్క్‌షాప్

● ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీ

లాంఫాం(తాడికొండ)ఆగస్టు 8: ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఖరీఫ్ పంటల సాగు ప్రణాళికపై వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన వర్షపాతం సాగుకు అనుకూలంగా ఉన్నదన్నారు. జిల్లాలవారీగా శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పరిస్థితులను సమీక్షిస్తూ రైతులకు పంట ప్రణాళికలు, ప్రత్యామ్నాయ పంటలపై సలహాలు సూచనలు తెలియజేయాలని సూచించారు. ఖరీఫ్ పంట కాలంలో ఖచ్చితమైన దిగుబడినిస్తూ, సాగుకు అనుకూలమైన భూమి మొత్తంలో లాభదాయకమైన సాగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బీ. ప్రమీలారాణి మాట్లాడుతూ వివిధప్రాంతాల్లో నీటి సదుపాయం, నేల స్వభావం మేరకు మండలాలు, జిల్లాలు, వ్యవసాయజోన్లను అనుసరించి పంటల ప్రణాళికలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు తయారు చేసి రైతులకు తెలియజేయాలన్నారు. తగిన విత్తనాలను అందుబాటులో ఉంచాలని చూసించారు. పరిశోధనా సంచాల కులు డాక్టర్ పీవీ.సత్యనారాయణ మాట్లాడుతూ సాగునీటికి ఇబ్బంది కలిగిస్తున్న గుర్రపుడెక్క నిర్మూలనకు చర్యలు చేపట్టాలని అన్నారు. వివిధ ప్రాంతాల్లో పత్తిసాగు విస్తీర్ణం తగ్గటానికి గల కారణాలు అన్వేషిస్తూ పంటలు సరళిలో మార్పుపై పరిశోధనలు చేపట్టాలన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి


శివరాజ్ యాదవ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అభిమానితో అధినేత..

● వినుకొండ కార్యకర్తతో యోగక్షేమాలు మాట్లాడిన సీఎం

వినుకొండటౌన్, ఆగస్టు 8: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక క్షణం తీరకలేకుండా పాలనా వ్యవహారాల్లో బిజీ బిజీగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు తనపై అంతులేని అభిమానాన్ని కనపరిచిన సాధారణ కార్యకర్త వినుకొండ మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన శివరాజ్‌యాదవ్‌ను పిలిపించుకుని మాట్లాడిన ఆసక్తికర సన్నివేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో చోటు చేసుకుంది. ప్రతిపక్షంలో ఉండగా తాను పర్యటనలకు వెళ్లినప్పుడు నిత్యం తనను అనుసరించి అభిమానాన్ని చూపిన కార్యకర్తలను గుర్తుపెట్టుకుని మరీ పిలిపించుకుని వారితో మాట్లాడడంతో శివరాజ్ యాదవ్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),ఆగస్టు 8: డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యే గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గుంటూరుజిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 150 మందికి శిక్షణ ఇస్తామని, ఇందులో గుంటూరు నుంచి 38 మంది, పల్నాడు జిల్లా నుంచి 74, బాపట్ల నుంచి 38 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాయలం, జడ్పీ వెనుక గుంటూరు (88866 63450), జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం ఏపీటీడబ్ల్యుఆర్ బాలుర పాఠశాల కాంప్లెక్స్, పల్నాడు బస్టాండ్ వెనుక, నర్సరావుపేట(8801582826), జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కాంప్లెక్స్ కర్లపాలెం రోడ్డు బాపట్ల(9948889653) చిరుమానాల్లో సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలలకు ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

● ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య రాష్ట్ర అసోషియేషన్ డిమాండ్

నరసరావుపేట, ఆగస్టు 8: డిగ్రీ కోర్సుల ఫీజులు 2023-24 విద్యా సంవత్సరానికి విడుదల చేయాలని, జీవోలు 36, 22లను రద్దు చేయాలని రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య అసోషియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రోటరీ హాల్‌లో గురువారం జరిగిన అసోషియేషన్ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేసినట్లు అసోషియేషన్ అధ్యక్షుడు కనుమర్ల గుండారెడ్డి తెలిపారు. విద్యా సంవత్సరం ముగిసినా నేటికీ ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడంతో కాలేజీల నిర్వహణ భారమవుతోందన్నారు. డిగ్రీ కాలేజీలకు బకాయిలతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను కళాశాలలకు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కాలేజీలకు ఐదేళ్లకు ఒకసారి అఫిలియేషన్ ఇచ్చేలా యూనివర్సిటీలకు సూచించాలన్నారు. 2022-2023 విద్యా సంవత్సరంలో కొత్త, అదనపు కోర్సులను ప్రవేశపెట్టడానికి జారీ చేసిన జీవో 36ని రద్దు చేయాలని, జీవో 22 రద్దు పరచి, కోర్సు ఫీజుల నిర్ణయం విషయంలో యూనివర్సిటీలకు అధికారం ఇవ్వాలన్నారు. పీజీ కోర్సులకు ఫీజు రియింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. 2018, 2019 సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యా, వసతి దీవెనను నేరుగా కళాశాల ప్రిన్సిపాళ్ల ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిగ్రీ విధానాన్ని రద్దు పరచి పాత విధానాన్ని అమలు చేయాలని గుండారెడ్డి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

జేజిఎల్ 384 రకానికి బదులుగా

అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలి

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందనగా ఏడీఏ వివరణ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 8: రైతులకు జేజిఎల్ 384 రకానికి బదులుగా అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన' విత్తనం కోసం క్యూ' అనే కథనానికి వివరణగా నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ మాట్లాడుతూ.. నరసరావుపేట సబ్ డివిజన్లోని వరి సాగు చేసే మండలాలు నరసరావుపేట ,రొంపిచర్ల, ఐదువేల హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కావలసిన విత్తనము 3750 క్వింటాళ్లుకానీ నరసరావుపేటకి ఇతర మండలాల నుంచి నకరికల్లు ముప్పాళ్ళ, ఈపూరు, శావల్యాపురం, వినుకొండ, ఇతర మండలాల నుంచి కూడా రైతులు జేజిఎల్ 384 కి అను రకం కోసం రావడం వలన భారీగా రైతులు రావడం జరిగిందన్నారు. రైతులకు జేజిఎల్ 384 రకానికి బదులుగా అనువైన రకాలైన ఎంటీయూ 12 24, ఎంటీయూ 12 82, కేఎన్ఎం 733, కేఎన్ఎమ్ 16 38, 34449, జే.ఈఎల్ 27356, ఆర్ఎన్ఆర్ 15 0 48, ఈపైన తెలిపిన స్వల్పకాలిక రకాలుపై రెండు మండలాల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు నరసరావుపేట టౌన్ లోని విత్తన దుకాణంలోనూ 6000 క్వింటాళ్ల విత్తనం సరఫరా చేశామన్నారు. 5000 క్వింటాల వరకు అమ్మకం జరుగగా, ఇంకా మార్కెట్లో అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలు 12 24, ఎంటీయూ 1282, ఎంటీయూ 12 62, ఎంటీయూ 12 71, కేఎన్ఎం 7 33, కేఎన్ఎం 16 38, ఎన్ఎల్ఆర్ 34 449, జేజిఎల్ 273 56, బీపీటీ 5204, అన్నపూర్ణ బీపీ2, అన్ని స్వల్పకాలిక రకాలైన 120 రోజుల నుంచి 130 రోజుల వరకు కాల పరిమితి చీడపీడలను తట్టుకునే రకాలు మార్కెట్‌లో అమ్ముకోవడానికి అనువైన రకాలు కోసం రైతులు ఎదురు చూడకుండా మంచి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు.


ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

● విద్యార్థినులతో అసభ్య ప్రవర్తనపై తల్లిదండ్రుల ఆగ్రహం

● పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

● పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు.. కేసు నమోదు

కారంపూడి, ఆగస్టు 8: కారంపూడి మోడల్ స్కూల్లో విద్యార్థినుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని గురువారం విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతారాహిత్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ విధమైన ఘటనలు జరుగుతున్నాయంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆరోపించారు. తమ పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై తక్షణమేచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారి పాఠశాలకు చేరుకొని విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదును స్వీకరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్‌చేశారు. ఆ సందర్భంలోనే ఎస్ఐ అమిర్ పాఠశాలకు చేరుకొని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ అమీర్ కేసు నమోదు చేశారు.

10న బాలల హక్కులపై సమావేశం

● హాజరు కానున్న ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో వికలాంగత్వంతో జీవించే పిల్లల హక్కుల పరిరక్షణపై స్టేక్ హోల్డర్స్‌తో రాష్ట్ర స్థాయివార్షిక సమావేశం (టీఏఎస్ఎస్‌సీ-2024) ఈనెల 10న గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జేజేసీ మెంబర్ డాక్టర్ జస్టిస్ వీ.ఆర్‌కె. కృపాసాగర్, జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్మన్ జస్టిస్ జి నరేందర్ హాజరుకానున్నారు. రెండు సెషన్లుగా జరిగే ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉన్నతాధికారులు హాజరై ప్రసంగించనున్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, ఎక్కన డీఎస్పీ

గంజాయి ముఠా అరెస్టు

● 21.096 కేజీలు స్వాధీనం ● ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి

తెనాలి రూరల్, ఆగస్టు 8: కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, కార్మికులు లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు జరుపుతున్న ముఠాను అరెస్టు చేసి, 21.096 కేజీల గంజాయి స్వాధీనం చేసుకునట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. కొల్లిపరకు చెందిన అమ్మిశెట్టి శివచందు, భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన దాసరి భరత్, కొల్లిపరకు చెందిన ఆవుల మంద పవనసాయి, ఒడిస్సా నుంచి వచ్చి చౌడవరంలో ఉంటున్న పరిద సిద్ధార్థ, తూర్పుగోదావరి జిల్లాకి చెందిన కందేపల్లి సతీష్, అదే జిల్లాకు చెందిన తోలెం రాములు ముఠాగా ఏర్పడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి సంగంజాగర్లమూడి డంపింగ్ యార్డు సమీపంలోని ఓ గదిలో వాటిని దాచి ఉంచేవారు. అనంతరం గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి తెనాలి రూరల్, చేబ్రోలు మండలాల పరిధిలోని పలు కళాశాలల విద్యార్థులక విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తుండేవారు. వీరిపై రూరల్ పోలీసులకు వచ్చిన సమాచారంతో నిఘా ఏర్పాటుచేయగా గంజాయి ప్యాకెట్లు అమ్మేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావులు సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. అదే ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న ఏడుగురిని గుర్తించి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురిపై ద్విచక్రవాహనాలు, బంగారం ఇతర చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. కేసు చేధించిన డీఎస్పీ జనార్ధనరావు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావులను ఎస్పీ అభినందించారు.

37,792 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 38,673 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 37,792 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 20,302 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	15500	334	9000	14000
నెంబరు. 5	9000	16500	నెంబరు. 5	9500	9500
273	10000	12000	273	–	–
341	9000	15000	341	11000	16200
4884	9500	13500	4884	13500	16500
సూపర్ 10	9700	11500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	9000	18500
బ్యాడిగి	8500	14500	బ్యాడిగి	9000	13000
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	4500	10000



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్

పాఠశాలను సందర్శించిన న్యాయాధికారి

● బాలల చట్టాలపై విద్యార్థినులకు అవగాహన


మాచర్లటౌన్, ఆగస్టు 8: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను గురువారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్ సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో సమావేశమయ్యారు. బాల్య వివాహాల నిషేదం, బాలికార్మిక, విద్యా తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, న్యాయవాదులు శ్రీహరి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీఎం చైతన్య

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

● పర్యాటక శాఖ డీవీఎం చైతన్య

మాచర్ల రూరల్, ఆగస్టు 8: పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య అన్నారు. గురువారం మండలంలోని విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్‌ను సందర్శించారు. శాంతిసిరి లాంచీని పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీవీఎం చైతన్య మాట్లాడుతూ నాగార్జున కొండకు వెళ్లే పర్యాటకుల కోసం లాంచీల్లో ప్రత్యేక సౌకర్యాలు చేసినట్లు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యాన లాంచీస్టేషన్‌కు నూతన బోట్లు తీసుకురానున్నట్లు చెప్పారు. అనంతరం హరిత రిసార్ట్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనవెంట పర్యాటకశాఖ అడ్మిన్ శ్రీధర్, అకౌంటెంట్ వెంకటేశ్వరరావు, లాంచీ స్టేషన్ ఇన్‌చార్జి వినయతుల్లా, మస్తాన్‌రావు, పులుసు వీరారెడ్డి పాల్గొన్నారు.


రామాపురంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

కృష్ణానది తీర గ్రామాల్లో వైద్యశిబిరాలు

దాచేపల్లి, ఆగస్టు 8: నాగార్జునసాగర్ డ్యాం నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతుంది. ఈ క్రమంలో నది తీరప్రాంత గ్రామాలైన పొందుగల, రామాపురం, భట్రుపాలెం, కాట్రపాడు, తంగెడ రేవుల వద్ద రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా రామాపురం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది తీరాన నివశిస్తున్న పల్లెకారులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా దాచేపల్లి ఎంపిడిఓ వెంకటరమణ పర్యవేక్షణలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పల్లెకారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నది ఉధృతంగా ప్రవహించడంతో నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, చేపల షికార్లు చేయవద్దని హెచ్చరికలు జారీచేశారు. రాత్రి వేళ పల్లెకారులకు అండగా పోలీసులు, వీఆర్ఏలు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. వారికి ఎటువంటి ఆహార సమస్య తలెత్తకుండా పల్లెకారులకు భోజన వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారులకు భోజనం ఏర్పాటు

అభినందనీయం

మాచర్లటౌన్, ఆగస్టు 8: నిరుపేద చిన్నారులకు భోజనం అందించడం అభినందనీయమని టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని స్వామి వివేకానంద స్టూడెంట్స్ హోంలో నిరుపేద చెంచు చిన్నారులకు నిత్యం భోజనం పంపిణీ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవా కార్యక్రమాలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ హోం నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ జయప్రకాష్, మీనాక్షి కంటి ఆసుపత్రి డైరెక్టర్ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, జానీ, జానీ బాషా, కేశవ, ప్రసాద్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట సీఐకి సత్కారం

అచ్చంపేట, ఆగస్టు 8 : అచ్చంపేట మండల పోలీసు స్టేషన్ సీఐ వెంకట ప్రసాదును బీజేపీ మండల అధ్యక్షుడు కడగంట్ల లక్ష్మణాచారి శాలువాతో ఘనంగా సత్కరించారు. గురువారం పోలీసు స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు జలసూత్రం తిరుపతి స్వామి, బొడెల వెంకటేశ్వరరావు, గోపీ తదితరులు సీఐని కలిసి అభినందనలు తెలిపారు.


మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి


న్యూవెల్లంపల్లి పాఠశాల చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
● నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులకు సూచనలు
● ముగిసిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పిడుగురాళ్ల, ఆగస్టు 8: నూతనంగా ఎన్నికైన పాఠశాల కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలలో ఎన్నికైన పలుగ్రామాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం కూడా పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి వుందని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల ఉన్నత స్థితికి పాఠశాల స్థాయి నుండే కమ్యూనికేషన్ స్కిల్స్ సెంటర్ల ద్వారా తగిన శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు వుండేలా నిరంతరం కృషి చేస్తున్నాడన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు వీరే ..

న్యూవెల్లంపల్లి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా కారుకోళ్ల చెన్నయ్య, చిన అగ్రహారం ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా నాగిళ్ల నాగలక్ష్మీ, వైస్ చైర్మన్‌గా ఓర్సు తిరుపతమ్మ, కరాలపాడు జడ్పీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా కళాయి మహబూబ్‌బి, వైస్‌చైర్మన్‌గా కొత్తపల్లి గోపాల్, ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా బాసిపోగు జానెస్, వైస్‌చైర్మన్‌గా నఫీషా కౌసర్, ఉర్దూ స్కూల్ చైర్మన్‌గా షేక్ జిలాని, జూలకల్లు జడ్పీ స్కూల్ చైర్మన్‌గా నర్రెడ్డి రామకృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్‌గా లంజేపల్లి ప్రియదర్శిని, ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా అల్లి శివ, వైస్‌చైర్మన్‌గా పామూరు ప్రభావతి, ఉర్దూస్కూల్ చైర్మన్‌గా షేక్ జానీబాషా, వైస్ చైర్మన్‌గా కొత్తపల్లి షకీల, హరిజనకాలనీ స్కూల్ చైర్మన్‌గా లంజేపల్లి వెంకటేష్, భూతం సాగరి, చెన్నాయ పాలెం ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా గండికోట రవితేజలు ఎన్నికయ్యారు.

మాచవరం : మండలంలోని మోర్జంపాడు హైస్కూల్ చైర్మన్‌గా పోలిశెట్టి శ్రీనివాసరావు, వేమవరం హైస్కూల్ చైర్మన్‌గా తోట మహేష్, పిల్లుట్ల జీవీజీకే ఆర్వో హైస్కూల్ చైర్మన్‌గా ఎస్‌కె మీరావలి, పిల్లుట్ల కేజీబీవీ పాఠశాల చైర్మన్‌గా నలబోతుల గోవర్ధన, మాచవరం హైస్కూల్ చైర్మన్‌గా ముక్కపాటి ధనలక్ష్మీ, పిన్నెల్లి హైస్కూల్ చైర్మన్‌గా మాచవరం మీరాబాబులతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కమిటీ సభ్యులందరూ కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

దాచేపల్లి : మండలంలోని 42 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్భాగాంధీ, ఆదర్శ పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు ఎన్నిక జరిగినట్లు ఎంఈవో పినాకపాణి తెలిపారు.

సత్తెనపల్లి రూరల్: బృగుబండ హైస్కూల్ చైర్మన్‌గా చందు వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా మేకల యాదగిరి, భాగ్యనగర్ కాలనీ పాఠశాల చైర్మన్‌గా చిలకా అమల, వైస్ చైర్మన్‌గా చిలక చైతన్యలు ఎన్నికయ్యారు. వీరితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సత్తెనపల్లి మండలం, పట్టణంలో మొత్తం 91 పాఠశాలలకు గాను 90 పాఠశాలలకు కమిటీ ఎన్నిక పూర్తయిందని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. రామకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాల ఎన్నిక సాంకేతిక కారణాల వల్ల జరగలేదని ఆయన తెలిపారు.

పెదకూరపాడు : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా హిదయతుల్లా ఎన్నికయ్యారు. గారపాడు జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా గడ్డం రామారావు, వైస్ చైర్మన్‌గా మునుగు పుష్పావతి ఎన్నికయ్యారు.

మాచర్లటౌన్ : పట్టణంలోని వీరభద్రపురం పాఠశాల చైర్మన్‌గా కొమెర శాంతికుమారి, వైస్ చైర్మన్ సాగర్‌బాబు ఎన్నికయ్యారు. బాలుర్నోన్నత పాఠశాల చైర్మన్‌గా మాచర్ల రాజు, వైస్ చైర్మన్‌గా మాచర్ల నాగలక్ష్మి ఎన్నికయ్యారు.

కారంపూడి: స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాల చైర్మన్‌గా బాణావత్ నాగేశ్వరరావు నాయక్, వైస్ చైర్మన్ నాగమల్లి నాగ పూజిత ఎన్నికయ్యారు. మండలంలోని పెదకొదమగుండ్ల ఎంపీపీ మెయిన్ పాఠశాల చైర్మన్‌గా ప్రజాపతి బాబులాల్, వైస్ చైర్మన్‌గా పల్లెగుంత లక్ష్మీ తిరుపతమ్మ ఎన్నికయ్యారు.

వెల్దుర్తి: వెల్దుర్తి మండల పరిధిలోని శిరిగిరిపాడు జడ్పీహెచ్ఎస్ కమిటి చైర్మన్ తోట వెంకట గురవయ్య ఎన్నికయ్యారు.

రాజుపాలెం: మండలంలోని ఏడు జిల్లా పరిషత్ హైస్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నిక ప్రశాంతగా జరిగింది. ఈ ఎన్నికలో ఎన్నికైన చైర్మన్లను, వైస్ చైర్మన్లను మండల, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

బెల్లంకొండ: బెల్లంకొండ జడ్పీహైస్కూల్ చైర్మన్‌గా కొండవీటి షేక్ రబ్బానీ, వైస్ చైర్మన్‌గా గడ్డిపర్తి రాములమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ శాలువాతో సత్కరించారు. బెల్లంకొండ ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా చేజర్ల షేక్ బూరే సైదా, మెయిన్ పాఠశాల చైర్మన్‌గా శంకర్, పాపాయపాలెం హైస్కూల్ చైర్మన్ ఓర్సు మల్లికార్జునరావు, వైస్ చైర్మన్‌గా ఓర్సువిజయ్, ఎస్సీ పాఠశాల చైర్మన్‌గా మీసాల కుమార్, వైస్ చైర్మన్‌గా సిద్దా రామకృష్ణ, బీసీ కాలనీ పాఠశాల చైర్మన్‌గా బీ నాగేంద్రబాబు, వైస్ చైర్మన్‌గా వీ.శ్రీను, నందిరాజుపాలెం ఎంపీయూపీ పాఠశాల చైర్మన్‌గా దామవరపు పెద్ద ఆదాం, వైస్‌చైర్మన్‌గా జొన్నలగడ్డ దీపిక, గంగిరెడ్డిపాలెం ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా వీ.రమణ, వన్నాయపాలెం పాఠశాల చైర్మన్‌గా డేగల రమేష్, వైస్‌చైర్మన్‌గా లక్కపోగు నాగరాజు, మన్నెసుల్తాన్ పాలెం పాఠశాల చైర్మన్‌గా చేవూరి రాజేశ్వరి, వైస్ చైర్మన్ తంగెడ ఆంజనేయులు, కందిపాడు పాఠశాల చైర్మన్‌గా దేశబోయిన అప్పయ్య, వైస్ చైర్మన్‌గా బండారు వెంకటేష్‌లు ఎన్నికయ్యారు.

క్రోసూరు: క్రోసూరు జడ్పీ హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా సీహెచ్ విజయ కుమారి, కే.కాళేశ్వరరావు, దొడ్లేరు హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎస్‌కే సీహెచ్ బాజీ, కే స్వరూపరాణి, ఊటుకూరు హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఆర్.సాంబశివరావు, యూ మేరీ, బయ్యవరం హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా కే.నరసింహారావు, పీ బిందు, 88 తాళ్ళూరు హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా వీ.భద్రయ్య, షేక్ జెమీలా, గుడిపాడు హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా షేక్ మహబూబ్ సుభానీ, ఎస్ మల్లేశ్వరి, హసానాబాద్ హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎస్ కనకారావు, జీ పార్వతి, నాగవరం హైస్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా సీహెచ్ కోటేశ్వరరావు, సయ్యద్ నసీమా, క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా షేక్ రఫీ, కే అంజలి, కస్తూర్బా గాంధీ పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా పీ.నాగమణి, సీహెచ్ అశోక్‌లు ఎన్నికయ్యారు.

అచ్చంపేట : మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా తాడువాయికి చెందిన మందా క్రీస్తురాజు ఎంపికయ్యారు. వేల్పూరు హైస్కూల్ చైర్మన్‌గా జే శ్రీనివాసరావు, కొండూరు హైస్కూల్ చైర్మన్‌గా ఏ.రమేష్, మాదిపాడు హైస్కూల్ చైర్మన్‌గా ఎం.కుమార్, అచ్చంపేట హైస్కూల్ చైర్మన్‌గా రాయిడి రాజాబాబు, కోనూరు హైస్కూల్ చైర్మన్‌గా సోమా పాపారావు, పెదపాలెం హైస్కూల్ చైర్మన్‌గా వట్టికొండ శ్రీలక్ష్మిలు ఎంపికయ్యారు. అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కోరం కానందున ఎన్నికను వాయిదా వేశారు.

నకరికల్లు: మండలంలోని పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. జెడ్పీ హైస్కూల్స్ వారీగా కుంకలగుంటకు రామిశెట్టి హనుమంతరావు, చేజర్లకు షేక్ హసన్, చల్లగుండ్లకు యర్రంశెట్టి శ్రీనివాసరావు, కండ్లకుంటకు రావెళ్ళ సత్యనారాయణ, నకరికల్లుకు కాసా మల్లిఖార్జునరావు, గుండ్లపల్లికి పుసులూరి గాంధీ, నకరికల్లు కేజీబీవీ జీ శకుంతల, చల్లగుండ్ల రాజీవ్‌గాంధీ స్మారక వికలాంగుల ఉన్నత పాఠశాలకు కే లక్ష్మయ్య, దేచవరం మోడల్ స్కూల్‌కు బత్తుల సైదుబాబులు పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. రూపెనగుంట్లలో జరిగిన ఎన్నికల్లో డీఈవో ఎం వెంకటేశ్వర్లు హాజరు కాగా నకరికల్లులో జరిగిన ఎన్నికకు ఎంఈవో ఎంఎల్ఎన్ ప్రసాదు హాజరయ్యారు.

దుర్గి : స్థానిక జడ్పీ హైస్కూల్ యాజమాన్య కమిటి చైర్మన్‌గా శీలం గాలయ్య, ఓబులేశునిపల్లె జడ్పీహెచ్ఎస్ చైర్మన్‌గా బొల్నేడి రామారావు, దుర్గి ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా సూరె వెంకటేశ్వర్లు, అడిగొప్పుల ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా చల్లా వెంకటేశ్వర్లు, ముటుకూరు జడ్పీహెచ్ఎస్ చైర్మన్ కే. మరియదాసు ఎన్నికయ్యారు.

రెంటచింతల : మండలంలోని జెట్టిపాలెం మోడల్ స్కూల్ చైర్మన్‌గా డి.రాజేష్, వైస్ చైర్మన్‌గా భూలక్ష్మి, మిట్టగుడిపాడు కేజీబీవీ చైర్మన్‌గా ఓర్సు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా షేక్ మౌలాలి, రెంటాల జిల్లా హైస్కూల్ చైర్మన్‌గా ఈ.ధనలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కె.హరినాయక్, వైఆర్ఎస్ హైస్కూల్ చైర్మన్‌గా డి.థామస్, వైస్ చైర్మన్‌గా జి.రాజు, సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎ.విజయబాబు, వైస్ చైర్మన్‌గా మెహరున్నీషా, లూథరన్ బాలికల హైస్కూల్ చైర్మన్‌గా డి. సుబ్బులు వైస్ చైర్మన్‌గా జి.చిన ఆంజనేయులు ఎన్నికయ్యారు.


యాదగిరి గుట్టకు బయలుదేరుతున్న టీడీపీ నేతలు

దుర్గి నుంచి యాదగిరి గుట్టకు..

దుర్గి, ఆగస్టు 8: మాచర్ల శాసనసభ్యునిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి అఖండ మెజార్టీతో గెలుపొందడంతో దుర్గికి చెందిన టీడీపీ నేతలు తమ మొక్కుబడి తీర్చుకునేందుకు దుర్గి నుంచి యాదగిరి గుట్ట వరకు బైకుపై గురువారం మహాయాత్ర చేపట్టారు. కోట కోటేశ్వరరావు, శెట్టిపల్లి నరసరావు, సీతారామయ్య, శ్రీనివాసరావు, ఎర్నాకుల రామకృష్ణ, వేముల వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనాలపై యాదగిరి గుట్ట పయనమయ్యారు. టీడీపీ నేతలు మేకల రామారావు, వెంకటేశ్వర్లు, గై గోపాల్, పెద బ్రమన్నారాయణ, కొవ్వూరి రామచంద్రయ్య, దుర్గారావు తదితరులు వారిని అభినందించారు.

12 నుంచి శిక్షణా తరగతులు

మాచవరం, ఆగస్టు 8: మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు ఈ నెల 12 నుంచి 14 వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా తగు సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో సురేష్ కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

● వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

క్రోసూరు, ఆగస్టు 8 : సీజనల్ వ్యాధుల వ్యాప్తికాకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అన్నారు. మండలంలోని పారుపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరిగి అనుమానితులను గుర్తించి సూచనలు, సలహాలు ఇచ్చారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలించి బ్లీచింగ్ చల్లించాలని, దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంపు కొనసాగించాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా వంటి వ్యాధులకు సంబంధించిన మందులు, సెలైట్ బాటిల్స్ ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచు కోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్ వైజర్ శివుడు, పలువురు ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

మరో రెండు హామీల అమలు

సత్తెనపల్లి, ఆగస్టు 8 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో రెండు హామీలను అమలు చేశారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేతన్నలకు జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ అమలు, 200 యూనిట్లు ఉచిత యూనిట్‌కు వెంటనే ఆదేశాలు జారీ చేశారన్నారు. చేనేత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

మాచర్లటౌన్, ఆగస్టు 8: పట్టణంలో కోర్టు ఆవరణలో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్ గురువారం ఒక ప్రకటనల పేర్కొన్నారు. సివిల్, గృహహింస, భరణం, బ్యాంకు, క్రిమినల్ తదితర రాజీపడదగిన కేసులు ఈ అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి సూచించారు.

రామాలయంలో చోరీకి విఫలయత్నం

దాచేపల్లి, ఆగస్టు 8: దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో వాటర్ ట్యాంక్ వద్ద వున్న రామాలయంలో చోరీ చేసేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. స్థానికులు, భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండగులు రామాలయానికి వున్న మెయిన్ గేటు తాళం పగలగొట్టేందుకు చేసిన ప్రయత్నం వృథా కావడంతో, ఆలయానికి ఎదురుగా పార్కింగ్ చేసిన ఆటోను తస్కరించేందుకు చేశారు. ఆ సమయంలో అలికిడి కాగా స్థానికులు వేసిన కేకలకు దొంగతనానికి వచ్చిన వ్యక్తులు పరారయ్యారు. చోరీకి వచ్చిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక యువకుడు వున్నారు. ఈ ఘటనపై గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భోజనం ప్యాకెట్ల అందజేత

సత్తెనపల్లి, ఆగస్టు 8 : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పుట్టిన రోజు వారోత్సవాల సందర్భంగా కొనసాగుతున్న కార్యక్రమాల్లో భాగంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద నిరు పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈనెల 13న పట్టణంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడులకను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేత ఏ నరేంద్ర, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లోకి నీరు

రెంటచింతల,ఆగస్టు 8 : రెంటచింతలలోని రేగులమాణ్యంలో వున్న బీసీ బాలుర వసతి గృహంలోకి ఎర్ర కాలువ నీరు చేరింది. హాస్టల్ ప్రాంగణమంతా నీటితో నిండిపోయింది. ఎర్రకాలువకు గండి పడటంతోనే నీరు లోపలికి విద్యార్థులు తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి.ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి కాలువకు పడిన గండిని పూడ్చి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమావేశానికి హాజరైన సివిల్ జడ్జి నాగ శ్రీనివాసరావు, వైద్యులు

న్యాయ అవగాహన సదస్సు

● హాజరైన సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

బెల్లంకొండ, ఆగస్టు 8 : మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మండలంలో సరైన మౌలిక వసతులు లేక బడుగు, బలహీనవర్గాలు సరైన న్యాయాన్ని పొందలేక పోతున్నారన్నారు. గిరిజనులకు ప్రభుత్వం ద్వారా పొందే ఆరోగ్య సేవలు అంది పుచ్చుకోలేక పోతున్నారన్నారు. ఈ సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదర్ ఆధ్వర్యంలో 91 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా ఎల్‌వీ ప్రసాదు కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 31 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, అక్కల వెంకట రామిరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ బాషా, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన

● పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

మాచవరం, ఆగస్టు 8: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనా వసతులు అందుబాటులో వున్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం నిర్వహించిన పాఠశాల కమిటీ ఎన్నికల నిర్వహణ పరిశీలనలో భాగంగా మండలంలోని పిల్లుట్ల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జరిగిన ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యా యులు ప్రభుత్వ పాఠశాలల సొంతమని, వారు డిజిటల్ బోధను విద్యార్థులకు చక్కగా అందించగలరని తెలిపారు. వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని తెలియజేశారు. రానున్నకాలంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా మెరుగైన వసతులను కల్పిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం, ఉచిత బట్టలు, పుస్తకాలు, తల్లికి వందనం వంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో వున్నాయన్నారు. మీ పిల్లల భవిష్యత్ బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో వారిని చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల నడవడికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ మంచి మార్గంలో పయనించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, స్థానిక సర్పంచ్ లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, మాజీ ఎంపీపీ కత్తి సరోజిని, ఎంపీడీవో సురేష్, కస్తూర్బా పాఠశాల హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

బాధితులలకు టీడీపీ నేతల పరామర్శ

అచ్చంపేట, ఆగస్టు 8 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన కంభపాటి కిరణ్, మేకల సురేష్‌లను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతినిధులు, అచ్చంపేట మండల టీడీపీ నేతలు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, మాజీ మండల అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు సిర్రా జక్రయ్య, పేటనీళ్ళ గంగయ్య, మేకల హనుమయ్య, జంపాని నాని తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలపై దృష్టి పెట్టండి

పిడుగురాళ్ల, ఆగస్టు8: ప్రభుత్వం గ్రామాలలో మౌలిక వసతులు, పారిశుధ్య చర్యలపై దృష్టి సారించని ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు. గురువారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణాకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ నిధుల వినియోగం, ప్రజాప్రతినిధుల బాధ్యతలు వంటి విషయాలపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. డాక్టర్ కేవీ మోహన్ పరిశీలకుడిగా వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణా తరగతులు

అచ్చంపేట, ఆగస్టు 8 : మండల కేంద్రమైన అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి గుంటూరు, ప్రకాశంజిల్లాల పర్యవేక్షణా అధికారి డాక్టర్ కే మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు గంగసాని నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కే.కుసుమకుమారి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం అభివృద్ధికి రూ. 6 లక్షలు విరాళం

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 8 : మండలంలోని గుట్లూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పుల్లారావు అబ్బూరు గ్రామంలో కనకదుర్గా కళ్యాణ మండప అభివృద్ధికి రూ.6 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో గురువారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారావును కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు.


పత్తి మొక్కలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్

వర్షాలతో పత్తి పైరుకి మేలు

క్రోసూరు, ఆగస్టు 8 : క్రోసూరు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు పత్తి పైరుకి మేలు చేస్తాయని మండల వ్యవసాయశాఖ అధికారి వీ.వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో పత్తి పొలాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పల్లపు ప్రాంతాల్లోని పత్తి పొలాల్లో నీరు నిలిస్తే ఆ నాటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలన్నారు. ఎరువులను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని, వర్షాలు తగ్గిన వెంటనే మొక్కల మధ్య అంతర్ సేద్యంచేయాలని, దీనివలన తేమ త్వరగా ఆరిపోయి మొక్కలు కోలుకుంటాయన్నారు. వాతావరణంలో తేమ అధికంగా ఉండటం వల్ల తెగుళ్ళు తొందరగా వ్యాపిస్తాయని, వీటి నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన పురుగుమందులు వాడాలని సూచించారు. తెగుళ్ళతో పాటు పచ్చదోమ వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎస్.పవన్‌కుమార్ ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వినుకొండ విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అనధికారికంగా వరి విత్తనాలు అమ్మితే చర్యలు

● వినుకొండ వ్యవసాయశాఖ అధికారి రవిబాబు

వినుకొండ, ఆగస్టు 8: ఎవరైనా అనధికారికంగా వరి విత్తనాలు అమ్మితే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వినుకొండ సహాయ వ్యవసాయ అధికారి బి.రవిబాబు హెచ్చరించారు. పట్టణంలోని విత్తన దుకాణాల్లో బి.రవిబాబు గురువారం తనిఖీచేశారు. జలాశయాలు నిండు కుండను తలపిస్తున్న నేపథ్యంలో రైతులు వరి నాట్లకు సిద్ధమవుతుండటంతో మార్కెట్‌లో గిరాకీగా ఉన్న జే.జీ.ఎల్ 384 నిల్వలను ఎంఆర్‌పీ రేట్లకే విక్రయించాలని షాపు యజమానులకు సూచించారు. రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది సాయంతో రైతులు అధికంగా కోరుతున్న వరి వంగడాలను అమ్ముతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏవో అంజిరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై ప్రత్యామ్నాయ వరి విత్తనాలు

వ్యవసాయశాఖ సహకారంతో సచివాలయాల వద్ద ఉన్న రైతు సేవ కేంద్రాల్లో జేజీఎల్ - రకానికి, ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1224 రకం కేజీ రూ.5 సబ్సిడీపై అందచేస్తున్నామని, అలాగే బీపీటీ-5204, ఎన్ఎల్ఆర్ 34449, ఎంటీయూ-1121 కూడా సబ్సిడీపై అమ్ముతున్నట్లు తెలిపారు. విత్తనాలు కావలిసిన రైతులు వ్యవసాయశాఖ అధికారులను, లేదా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.



కొనకంచివారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న నోడల్ అధికారి హనుమ కుమార్

'ఫ్యామిలీ హెల్త్ డాక్టర్'ను పరిశీలించిన నోడల్ అధికారి

రొంపిచర్ల, ఆగస్టు 8: మండలంలోని కొనకంచివారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ ఆరోగ్య కార్యక్రమాన్ని నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డయేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల గురించి గ్రామస్థులకు వివరించారు. పెద్దవారికి వేసే టీకా కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జగన్‌నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల కోసం నమోదు చేసుకోవాలి

● మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామారావు

శావల్యాపురం, ఆగస్టు 8: ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగుచేసే రైతులు ప్రభుత్వం రాయితీపై అందించే వరి విత్తనాల కోసం వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి ముందుగా నమోదు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జేజేలు వరి విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో వాటికి బదులుగా రైతులు ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638 రకం వరివిత్తనాలు సాగుచేసుకోవచ్చని వ్యవసాయశాఖ కమిషనర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేశారని, ప్రభుత్వం ఐదు రకాల వరి విత్తనాలను కేజీకి రూ.5చొప్పున రాయితీపై అందిస్తుందన్నారు. బీపీటీ-5204, ఎంటీయూ-1224 వరి విత్తనాలు 25కేజీల బ్యాగు రూ.920, కేఎన్ఎం-1638, ఎన్ఎల్ఆర్-34449 వరి విత్తనాలు 30కేజీల బ్యాగు రూ.1065, ఎంటీయూ-1121 వరి విత్తనాలు 30కేజీల బ్యాగు రూ.1044లకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. వరి విత్తనాల కోసం నమోదు చేసుకొన్న రైతులకు రెండ్రోజుల వ్యవధిలో విత్తనాలు అందజేయడం జరుగుతుందన్నారు. కాబట్టి వరి విత్తనాలు కావలసిన రైతులు వీఏఏలను సంప్రదించి త్వరితగతిన నమోదు చేసుకోవాలని కోరారు. ఆయనతో ఏఈవో పూరేటి అశోక, వీఏఏలు ఉన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 8: పల్నాడు జిల్లాలో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకుంటున్న యువతీ, యువకులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జనరేట్ యువర్ బిజినెస్ అనే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకుంటున్న యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల వారు లింగగుంట్ల కాలనీలో ఉన్న నాక్ శిక్షణ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 9160200652 నెంబర్లో సంప్రదించాలని కోరారు.



పొట్లూరు జడ్పీ పాఠశాలలో చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సత్కరిస్తున్న నాయకులు

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

శావల్యాపురం, ఆగస్టు 8: శావల్యాపురం మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలలో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 5జడ్పీ, 2 ప్రాథమికోన్నత, 32 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఒక్క వేల్పూరులోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మాత్రమే కోరం సరిపోక ఎన్నికను వాయిదా వేశారు. మిగిలిన 38 పాఠశాలలలో తొలుత ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 528మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులు వారిలో నుంచి చైర్మన్, వైఎస్ చైర్మన్‌లను ఎన్నుకొన్నారు. 37 పాఠశాలలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, మతుకుమల్లి జడ్పీ పాఠశాలలో మాత్రం చైర్మన్ ఎన్నికకు మల్నీడి రామాంజమ్మ, శివాది పాపారావు మధ్య పోటీ జరిగింది. మొత్తం 15 ఓట్లకుగాను రామాంజమ్మకు 9ఓట్లు, శివాది పాపారావుకు 6ఓట్లు వచ్చాయి. వైఎస్ చైర్మన్‌గా నలబోలు లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శావల్యాపురం జడ్పీపాఠశాల చైర్మన్‌గా పాటిబండ్ల శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్‌గా సిద్దారపు సిద్దాబి, పొట్లూరు జడ్పీపాఠశాల చైర్మన్‌గా చింతా సైదా రామారావు, వైస్ చైర్మన్‌గా తమ్మిశెట్టి శారద, వేల్పూరు జడ్పీ పాఠశాల చైర్మన్‌గా దన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్ చైర్మన్‌గా బొల్లా అంజలీదేవి, కారుమంచి జడ్పీ పాఠశాల చైర్మన్‌గా తొజిటి రఘుబాబు, వైస్ చైర్మన్‌గా మండె సుజాతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్నకంచెర్ల ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్‌గా కమతం కళ్యాణి, వైఎస్ చైర్మన్‌గా పూరేటి వెంకటేశ్వర్లు, వయ్యకల్లు ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్‌గా పెద్దేటి నరేష్, వైస్‌చైర్మన్‌గా పాలెపోగు నవీన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్ఎంసీ ఎన్నికలు ముగిసేదాకా ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితకుమారి, ఎస్ఐ చల్లా సురేష్ తమసిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

విద్యార్థికి అభినందన సభ

వినుకొండ, ఆగస్టు 8: నియోజకవర్గంలోని నూజండ్ల మండలం మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన కొత్త పరంజ్యోతి లండన్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతూ నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్ చర్చిలో గురువారం విద్యార్థికి అభినందన సభను ఏర్పాటు చేశారు. విద్యార్థిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. దేశంలో స్కాలర్‌షిప్‌లకు 125మంది ఎంపికవ్వగా వారిలో పరంజ్యోతి కూడా ఉండడం అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఫైడ్ రాజు, దేవప్రసాద్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల పథకాలను పునరుద్ధరించాలి

పలు గ్రామాల ప్రజల డిమాండ్



కారుమంచిలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్‌ప్లాంట్

శావల్యాపురం, ఆగస్టు 8: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని తక్కువ ధరలకు అందించాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల పథకాలను ఏర్పాటుచేయగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని నిర్వీర్యం చేసింది. ఎన్టీఆర్ సుజల పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించి ప్రజలకు తాగునీటి కష్టాల నుంచి విముక్తిని కలిగించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని కారుమంచి, వయ్యకల్లు, గుంటుపాలెం, మతుకుమల్లి, బొందిలిపాలెం, శానంపూడి, ముండ్రువారిపాలెం, చిన్నకంచెర్ల, పిచికలపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ సుజల పథకాల పేరుతో గత టీడీపీ ప్రభుత్వం మినీవాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి, వాటికి తాగునీటిని సరఫరా చేసేందుకు వినుకొండ మండలం పెదకంచెర్ల గ్రామంలో మదర్ ప్లాంట్‌ను నిర్మించింది. టెండర్ల ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్లకు వాటి నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. ఎన్టీఆర్ సుజల పథకాలు ప్రారంభించిన నెలల వ్యవధిలోనే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ సుజల పథకాలకు వైఎస్సార్ సుజల పథకాలుగా పేర్లుమార్చి వాటికున్న రంగులు కూడా మార్చి వైసీపీ రంగులు వేశారు. పేర్లు, రంగులు మార్చడంపై చూపిన ఆసక్తిని పథకాల నిర్వహణపై చూపకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం తరపున అందించాల్సిన రాయితీలు అందించకపోవడంతో నిర్వహణ కష్టతరంగా మారి పథకాన్ని నిలిపేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినీవాటర్ ప్లాంట్‌లకు కరెంట్ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు కరెంట్ మీటర్లు తొలగించారు. ప్రజలకు విక్రయించిన నెలవారీ కార్డులు కూడా పూర్తి కాకుండానే కాంట్రాక్టర్లు పథకాన్ని నిలిపివేయడంతో కార్డులు కొన్నవారు నష్టపోయారు. లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన పథకాలు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం చొరవచూపి పథకాలను పునరుద్ధరించి తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై విచారణకు పీడీ ఆదేశం



అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు

నాదెండ్ల, ఆగస్టు 8: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం 2023-24 ఉపాధి హామీ పనులపై ప్రజా వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాదెండ్ల, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని ఏపీడీ సుధాకర్‌ని ఆయన ఆదేశించారు. నాదెండ్ల గ్రామంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పని దినాలు కల్పించటమే కాకుండా పనిచేయని వ్యక్తులకు హాజరు వేయటం, మృతిచెందిన వ్యక్తి పేరుతో పని దినాలు కల్పించటం లాంటి పలు ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. అమీన్‌సాహెబ్‌పాలెంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గ్రామంలో నివశించని వారి పేర్లతో జాబ్ కార్డులు ఇచ్చి నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై విచారణ జరపాలని ఏపీడీ సుధాకర్‌ను డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ ఆదేశించారు. తూబాడు గ్రామంలో ఏప్రిల్ నెలలో పనిచేసిన కూలీలకు సంబంధించి హాజరును ఇంతవరకు కంప్యూటరీకరణ చేయకపోవటంపై మేట్లు ఫిర్యాదు చేశారు. గణపవరం గ్రామం మునిసిపాలిటీలో విలీనమైన కోర్టు స్టేతో పంచాయతీ అధికారులు పరిపాలన కొనసాగిస్తున్నారని మాజీసర్పంచ్ హిమవంతరావు వివరించారు. తమ గ్రామంలో ఎందుకు ఉపాధిహామీ పనులు నిలిపివేశారని ప్రశ్నించారు. జాబ్ కార్డులు రద్దయ్యాయని అధికారులు పేర్కొనగా ఇతర పనులకు ఉపాధి నిధులు ఎలా ఇచ్చారని? ప్రశ్నించారు. వెంటనే జాబ్ కార్డులు ఇచ్చి ఉపాధి పనులు కల్పించాలని పీడీ ఆదేశించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ సుధాకర్, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఏపీవో పుష్పరాజు, ఎస్ఆర్‌పీ లోకేశ్, సాంకేతిక సహాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏ లు

గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన


యడ్లపాడు, ఆగస్టు 8: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ ప్రభుత్వాన్ని కోరారు. పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న విధంగా పేస్కేలు అమలు చేయాలన్నారు. అలాగే నరసరావుపేట డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్‌వాచ్‌మెన్ పోస్టులను బర్తీచేయాలన్నారు. అలాగే అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు, నైట్‌వాచ్‌మెన్ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ విజయశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో యడ్లపాడు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షులు కోటేశ్వరమ్మ, రాజేష్, నసీమా, రాజారత్నం, నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారుమంచి రేషన్ షాపులో విజిలెన్స్ తనిఖీలు

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 8: మండలంలోని కారుమంచిలోని రేషన్‌షాపు నెంబర్ 11లో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు తెలిపిన వివరాల మేరకు షాపులో బియ్యం నిల్వలను పరిశీలించగా ఉండాల్సిన నిల్వల కంటే 25క్వింటాళ్ళు తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు కారుమంచి నుంచి వెల్లలచెరువు వెళ్ళే మార్గంలో రోడ్డుపై నిలిపియున్న ట్రాక్టర్, ట్రక్కులను పరిశీలించగా అందులో 10.5 క్వింటాళ్ళు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. పట్టుకొన్న బియ్యాన్ని, ట్రాక్టర్, ట్రక్కును శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రేషన్ డీలర్‌పై 6ఏ కేసును నమోదు చేసినట్లు తెలిపారు. కారుమంచిలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గ్రామస్తులు కొందరు వెల్లలచెరువుకు వెళ్ళే మార్గంలో ట్రాక్టర్ ట్రక్కులో రేషన్ బియ్యం బస్తాలున్నాయని, ఫోన్‌లో సీఎస్‌డీటీ విద్యాసాగర్‌కు సమాచారాన్ని తెలుపగా తనవద్దకు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే తనిఖీ చేస్తామనటంతో గ్రామస్థులు నివ్వెరబోయారు. అంతలో ఎస్ఎంసీ ఎన్నికల పర్యవేక్షణకు కారుమంచికి వచ్చిన కానిస్టేబుల్‌కు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించి ట్రాక్టర్ వద్దకు వెళ్ళి ట్రక్కులోని రేషన్ బియ్యాన్ని పరిశీలించి వీఆర్వో దేవమ్మకు సమాచారం అందించాడు. దీంతో అక్కడే ఉన్న విజిలెన్స్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్ళి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు.

● ఈపూరు, ఆగస్టు 8: ఈపూరులోని రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. 1, 18 నంబర్ల షాపులను తనిఖీ చేసి సరుకు వ్యత్యాసం ఉండడంతో 6ఏ కేసులు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ విద్యాసాగర్ తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

వినుకొండ టౌన్, ఆగస్టు 8: మండలంలోని పెద్దకంచర్లలో నూతనంగా నిర్మించి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గణపతి, వరాహ, శ్రీదేవి, గోదాదేవి, గరుడ విహాల ప్రతిష్ఠతోపాటు, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణతో మూడురోజులు పాటు జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

63 పాఠశాలలకు ఎన్నికలు పూర్తి


నాదెండ్ల, ఆగస్టు 8: మండలంలోని పలు గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత, ప్రాథమిక స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి. మండలంలో మొత్తం 64 పాఠశాలలు ఉండగా విద్యార్థులు లేని కారణంగా ఎండుగుంపాలెం ఎస్‌డబ్ల్యూ పాఠశాల ఎన్నిక జరగలేదు. సాతులూరు జడ్పీ పాఠశాల చైర్మన్‌గా మేడా సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా డీ శ్రీలక్ష్మి, సంక్రాంతిపాడు ఉన్నత పాఠశాలకు కర్నాటి విజయపార్థు, షేక్ సలీమా, ఏపీ మోడల్ పాఠశాలకు ఎస్ జానకి, పీ పావని, తూబాడు ఉన్నత పాఠశాలకు జే రత్నరాజు, షేక్ ఫైరోజ్, కనపర్రు పాఠశాలకు ఎస్ శ్రీనివాసరావు, కే నాగమణి, అమీన్‌సాహెబ్‌పాలెం పాఠశాలకు కే సురేష్, సీహెచ్ రమణ, ఎండుగుంపాలెం పాఠశాలకు జీ అపర్ణ, పీ రాంబాబు, నాదెండ్ల కస్తూర్బా పాఠశాలకు నేలపాటి శోభారాణి, కాశిమళ్ళ సురేష్, నాదెండ్ల ఉన్నత పాఠశాలకు సలశం ప్రియాంక, విప్పర్లచిన భాస్కరరావు, గణపవరం జెడ్పీ పాఠశాలకు చైర్మన్‌గా కే సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా జీ శారదలు ఎన్నికయ్యారు.

● ఈపూరు, ఆగస్టు 8: మండలంలో గురువారం మొత్తం 47 పాఠశాలలకు గాను 45 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నిక చేశారు. ముప్పాళ్ళ ఎస్‌పీఎస్ పాఠశాలలో పిల్లలు లేక కమిటీ నియామకం జరగలేదు. మోడల్ స్కూల్ కమిటీ కూడా నియామకం జరగలేదు.

రెడ్డిపాలెంలో రైతులకు వరి వంగడాలపై అవగాహన

రొంపిచర్ల, ఆగస్టు 8: మండలంలోని విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ఎదురు ఖరీఫ్ పంట కాలానికి వేస్తున్న వరి రకాల మీద అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం ఉప సంచాలకులు శివకుమారి, నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ పాల్గొన్నారు. వరి పంటకు పల్నాడు జిల్లాలో ఎక్కువగా జేజీఎల్ 384 రకంను రైతులు విత్తుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆరకం అందుబాటులో లేదని, దీనికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638 రకాలను సాగు చేసుకోవచ్చన్నారు. అవి జేజీఎల్ కంటే ఎక్కువ దిగుబడి ఇవ్వటమే కాకుండా తెగుళ్ళను తట్టుకుంటాయన్నారు. వీటితో పాటు ఆర్ఎన్ఆర్ 14, 449, ఎంటీయూ 1121, 1271, 1282, 1262, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తుందన్నారు. కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వినుకొండ వాసికి డాక్టరేట్



పొందూరి శివప్రసాద్

వినుకొండ, ఆగస్టు 8: పట్టణంలోని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పొందూరి వెంకటేశ్వర్లు కుమారుడు శివప్రసాద్‌కు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ తరఫున గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శివప్రసాద్ గత 16ఏళ్ళుగా ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మిల్లీ డిగ్రీ ఎస్టిమేటర్ ఫర్ స్పేస్ సిగ్నల్స్ ఆన్ ఎఫ్‌పీజీఏ అనే అంశంపై జరిపిన పరిశోధనకు గాను శివప్రసాద్‌కు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. ఈ అంశంపై రాసిన నాలుగు పరిశోధనపత్రాలు పలు అంతర్జాతీయ జనరల్‌లో ప్రచురితమై, పలు సదస్సులలో చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరుకు శివప్రసాద్ సెక్రటరీగా వ్యవహరిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

హస్సనాయుడుపాలెం సర్పంచి పదవికి భారతి రాజీనామా

వినుకొండ టౌన్, ఆగస్టు 8: మండలంలోని హస్సనాయుడుపాలెం గ్రామ సర్పంచి నంబూరి భారతి వ్యక్తిగత కారణాలతో తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయితీ అధికారి భాస్కరెడ్డికి తన రాజీనామా పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా తనకు ఇప్పటివరకు సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఢిల్లీలో ధర్నాకు వినుకొండ మాలమహానాడు నేతలు

వినుకొండ, ఆగస్టు 8: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన ధర్నా కార్యక్రమంలో వినుకొండకు చెందిన మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం జరగనున్న ధర్నాలోనూ సుప్రీంకోర్టు ధర్మాసనంలో 9మంది న్యాయమూర్తుల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని అప్పీలు చేయనున్నట్లు పౌలు తెలిపారు.

కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణ

ఈపూరు, ఆగస్టు8: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి గుంటూరు వారి ఉత్తర్వుల ప్రకారం ఆర్‌జిఎస్ఏ కార్యచరణ ప్రణాళిక 2024-25కు సంబంధించి శిక్షణ ఉంటుందన్నారు.



టిడ్కో గృహ సముదాయాన్ని గురువారం పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పుల్లారావు - చిలకలూరిపేట

ఎన్‌డీఏ హయాంలోనే గిరిజనులకు న్యాయం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 8 : ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలోనే ఎస్టీలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి గిరిజన దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎస్టీలకు అన్నివిధాలా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అవకాశం కల్పించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బీ శ్రీనునాయక్, బీ చిన్న నాయక్, బీ రాంబాబు నాయక్, ఎం వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తానా తదుపరి అధ్యక్షుడు నరేన్‌కు ప్రత్తిపాటి శుభాకాంక్షలు

చిలకలూరిపేట, ఆగస్టు 8: తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) తదుపరి అధ్యక్షుడుగా (2025-27) వర్జీనియాకు చెందిన నరేన్ కొడాలికి మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని పాతూరి అతిథి గృహంలో నరేన్‌ను ప్రత్తిపాటి కలిశారు. ఈ సందర్భంగా నరేన్‌ను ఘనంగా సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నరేన్ హయాంలో మాతృభూమితో తానా బంధం మరింత బలోపేతం కాగలదని ఆకాంక్షించారు. ప్రవాసాంధ్రుల సహకారం రాష్ట్రానికి ఎంతో అవసరమని, ఆ దిశగా నరేన్ కృషి చేయాలని ప్రత్తిపాటి కోరారు.

నాణ్యమైన పౌరసేవలు అందించాలి

● మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో తహసీల్దార్ విజయశ్రీ



మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయశ్రీ

యడ్లపాడు, ఆగస్టు 8: ప్రజలకు నాణ్యమైన పౌరసేవలు అందించడమే లక్ష్యంగా మీ సేవ కేంద్రాల నిర్వాహకులు పనిచేయాలని తహసీల్దార్ జె విజయశ్రీ సూచించారు. మండలంలోని మీసేవా కేంద్రాల నిర్వాహకులతో తహసీల్దార్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలకు వచ్చే పౌరులకు తగిన సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే దరఖాస్తు నింపే సమయంలో సహకారం అందించాలన్నారు. దరఖాస్తు తీసుకునే సమయంలోనే అవసరమైన అన్ని పత్రాలను సేకరించాలన్నారు. అధికారులతో సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోపు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మీసేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా, సాంస్కృతిక వేడుకలు

చిలకలూరిపేట, ఆగస్టు 8: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక వేడుకలను నిర్వహిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ నాయకులు మెగావత్ శాయినాయక్, నియోజకవర్గ సీపీఐ నాయకురాలు నాగభైరు రామసుబ్బాయమ్మ గురువారం తెలిపారు. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కే నరేంద్రరెడ్డి

వితంతువుల కోసం ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు

చిలకలూరిపేట, ఆగస్టు 8: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వితంతు పింఛన్ పథకానికి సంబంధించి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వితంతువుల హక్కులు, వారు భరణం ఎలా పొందాలి? అనే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. మునిసిపల్ కమిషనర్ గోవిందరావు, ఎంపీడీవో కే శ్రీనివాసరావు వితంతువుల పింఛన్ పథకం నమోదుకు దరఖాస్తు చేసుకునే విధానం, అందుకు ఉన్న అర్హతలు, కావాల్సిన పత్రాలు, సంబంధిత అధికారుల వివరాలను పేర్కొన్నారు. సదస్సులో న్యాయవాదులు ఆనందరావు, ప్రసాదు, భానుప్రసాదు, రామాంజనేయులు తదితరులు పాల్గొని ఉచిత న్యాయసహాయం పొందే విధానాన్ని వివరించారు.

స్టెమ్ క్యాంపులో నవోదయ విద్యార్థినికి ప్రథమ బహుమతి



స్టెమ్ క్యాంపులో ప్రథమ బహుమతి పొందిన నవోదయ విద్యార్థిని

చిలకలూరిపేట, ఆగస్టు 8: చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎం నవోదయ విద్యాలయానికి 10వ తరగతి విద్యార్థిని సాయి గీతిక జాతీయస్థాయి స్టెమ్ క్యాంపులో ప్రథమ స్థానం పొందారు. రూ.12వేలు విలువ చేసే ఒక స్మార్ట్‌వాచ్ ఆమెకు నిర్వాహకులు అందజేశారు. మరొక 10వ తరగతి విద్యార్థిని ఉమామహేశ్వరి అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో పతకాన్ని పొందారు. నవోదయ విద్యాలయ సమితి, అపరాజిత ఫౌండేషన్ వారు జాతీయస్థాయిలో సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ (స్టెమ్) క్యాంపును నిర్వహించారు. ఈ విద్యార్థులిద్దరు క్యాంపులో పాల్గొని బహుమతులు పొందారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు సత్కరించి అభినందనలు తెలిపారు.

బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేట, ఆగస్టు 8: పట్టణానికి చెందిన వైద్యుడు డాక్టర్ జక్కంపూడి శ్రీమన్నారాయణ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బాపూజీ వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన సతీమణి డాక్టర్ సరళాదేవి, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండరీపురం రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ తిలక్ మాట్లాడుతూ దివంగత డాక్టర్ శ్రీమన్నారాయణ మూడున్నర దశాబ్దాల పాటు నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో జక్కంపూడి మాలతి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.